క్లుప్తంగా

నేడు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

సత్తెనపల్లి: పురపాలక సంఘ పరిధిలో కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో గురువారం ఉదయం 10 గంటలకు, గార్లపాడురోడ్‌లోని రంగా విగ్రహం వద్ద సాయంత్రం 3 గంటలకు నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి బుధవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి హాజరవుతారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు, అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

నకరికల్లు: మండలంలోని వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు నాల్గవ విడత నగదును పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత మండలంలోని 1055 గ్రూపులకు రూ.8కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గురువారం నిర్వహించనున్న కార్యక్రమానికి మహిళా సంఘాల సభ్యులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

నేటి నుంచి పెన్షన్ల పంపిణీ

క్రోసూరు: మండలంలోని 15 సచివాలయాల పరిధిలో వలంటీర్లు గురువారం నుంచి సామాజిక పెన్షన్లు పంపిణీ చేస్తారని ఈవోపీఆర్డీ పి.శివరామయ్య బుధవారం తెలిపారు. ప్రతి లబ్ధిదారుకు రూ.3వేల పెన్షన్ వలంటీర్లు అందిస్తారని తెలిపారు. మండలంలో ఫిబ్రవరి నెలకుగాను మొత్తం 8,920 మంది లబ్ధిదారులకు రూ.2,66,18,000 మంజూరైనట్లు వివరించారు.

కరుణామయురాలు కానుకమాత



రెంటచింతల: కనికరం కలిగిన కరుణామయురాలు కానుకమాత అని తాళ్ళచెరువు విచారణ సహాయ గురువులు రెవ.ఫాదర్ కఠారి కిరణ్ అన్నారు. స్థానిక కానుకమాత చర్చి 174వ తిరునాళ్ల మహోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దుమరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పునీత ఆరోగ్య నాథుని మందిరం వద్ద నవదిన ప్రార్థనలలో భాగంగా నిర్వహించిన పవిత్ర సమిష్టి దివ్యపూజాబలిలో ఫాదర్ కిరణ్ భక్తులనుద్దేశించి మాట్లాడారు. క్రైస్తవ విశ్వాసులు పరిపూర్ణమైన హృదయంలో దైవప్రార్థన చేసి క్రీస్తు సూక్తులను అనుసరించి సమాజంలో నిజమైన కథోలికులుగా జీవించాలన్నారు. ఈ సమిష్టి దివ్యపూజాబలిలో సహాయ గురువులు అగస్టీన్, డీకన్ బ్రదర్ కోడిగంటి నిఖిల్, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

చిరుమామిళ్లలో ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ

నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్లలో రూ.6 కోట్ల నిర్మించనున్న 30 పడకల ప్రభుత్వాస్పత్రికి గురువారం భూమి పూజ నిర్వహించనున్నట్లు సర్పంచి సింగారెడ్డి లక్ష్మీకోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, కేఎస్ లక్ష్మణరావు, ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ సభ్యుడు మస్తాన్‌రావు హాజరు కానున్నట్లు చెప్పారు.

రక్తదాన శిబిరం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీమతి గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సీ సంయుక్తంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు ప్రారంభించారు. మొత్తం 31 మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు జి.అంజయ్య, బీఆర్‌కే కిషోర్, బెల్లంకొండ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో రైతులే శాస్త్రవేత్తలు

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయంలో రైతులే శాస్త్రవేత్తలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. జిల్లాలోని రైతు శాస్త్రవేత్తలకు నాలుగు సంవత్సరాల రైతు శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో సెమిస్టర్ కోర్స్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ రైతు శాస్త్రవేత్తల మొదటి సంవత్సరంలోని రెండు సెమిస్టర్లలో రైతుల సొంత పొలాల్లో వివిధ రకాల ప్రకృతి వ్యవసాయ మోడల్స్, సాఫ్ట్‌స్కిల్స్, అగ్రో ఏకాజి మాడ్యూల్స్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. టీపీపీ రమ్య, డీపీపీ బాషా, భవానీ రాజ్ పాల్గొన్నారు.

శరవేగంగా కులగణన సర్వే

- సత్తెనపల్లి డివిజన్‌లో మొదటి స్థానంలో క్రోసూరు, ఆఖరి స్థానంలో నిలిచిన నకరికల్లు మండలం
- 147 సచివాలయాల్లో 1,95,037 కుటుంబాల సర్వే పూర్తి



పట్టణంలోని 14వ వార్డులో కులగణన సర్వేలో సచివాయి సిబ్బంది, వలంటీర్

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే తొలి దశ తుది అంకానికి చేరింది. శతాబ్ద కాలంగా కులగణన సర్వేకి నోచుకోక అట్టడుగు బలహీన వర్గాల ప్రజలకు చేరవలసిన సంక్షేమ పథకాల్లో కోత పడుతూనే ఉంది. నిరుపేద కుటుంబాలు ప్రభుత్వం నుంచి అందే ఏ సంక్షేమ పథకాన్ని కోల్పోకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 19న కులగణన సర్వేని చేపట్టారు. శరవేగంగా సాగుతున్న ఈ సర్వేలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తూ కులాల వారీగా జనాభాను లెక్కిస్తున్నారు. సచివాలయాల స్థాయిలో జరుగుతున్న కులగణన సర్వేతో అన్ని కులాల జనాభా లెక్కలు పక్కాగా నిర్ధారణ కానున్నాయి. తొలివిడత కులగణన సర్వే ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరగనుంది. సర్వేలో ఇంటింటా కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలతో పాటు కులం, మతం, వ్యవసాయ భూములు, వృత్తి, విద్యార్హత, తదితర వివరాలను వలంటీర్లు నమోదు చేస్తున్నారు. ఫిబ్రవరి 2 నుంచి రెండో దశ కులగణన సర్వే ప్రారంభమవుతుంది. క్షేత్రస్థాయిలో నమోదు కాని కుటుంబీకులు ఫిబ్రవరి 2 నుంచి సచివాలయం వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల పరిధిలోని 147 సచివాలయాల పరిధిని 2,918 క్లస్టర్లుగా విభజించి 1,95,037 కుటుంబాలకు చెందిన 5,51,218 మంది కుటుంబ సభ్యులను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. అత్యధికంగా క్రోసూరు మండలం 92.75 శాతంతో సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్‌లో మొదటి స్థానంలో నిలిచింది. అత్యల్పంగా నకరికల్లు మండలం 84.02 శాతంతో ఆఖరి స్థానంలో నిలిచింది.

రేపటి నుంచి రెండో దశ



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమష్టి కృషితో కొనసాగింది. సర్వేని ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం వారానికి రెండుసార్లు సిబ్బందికి సమీక్ష నిర్వహించాం. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి రెండో దశ కులగణన సర్వే ప్రారంభం కానుంది.

– కొలిమి షమ్మి, మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి

సత్తెనపల్లి డివిజన్‌లో మండలాల వారీగా కులగణన వివరాలు..

మండలం	సచివాలయాలు	క్లస్టర్లు	కుటుంబాలు	జనాభా	నమోదు శాతం
సత్తెనపల్లి టౌన్	15	309	19,344	56,881	87.61
సత్తెనపల్లిరూరల్	19	404	26,061	72,727	84.46
ముప్పాళ్ళ	13	209	14,847	41,401	92.17
రాజుపాలెం	14	246	16,953	48,944	87
నకరికల్లు	14	335	22,221	62,530	84.02
పెదకూరపాడు	14	264	17,953	49,098	84.81
అమరావతి	16	346	24,011	66,387	88.47
అచ్చంపేట	17	334	21,917	62,175	85.32
క్రోసూరు	15	314	21,195	60,080	92.75
బెల్లంకొండ	10	157	10,535	30,995	91.81

గురుకులాల్లో ప్రవేశాలకు వేళాయె!

- 2024 మార్చి-10న ప్రవేశ పరీక్ష
- దరఖాస్తుకు ఫిబ్రవరి 23 వరకు గడువు
- ఐదో తరగతిలో 1,680 సీట్లు
- ఇంటర్మీడియట్‌లో 1,040



సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల భవనం

సత్తెనపల్లి: పేద, మధ్య తరగతి, అల్పాదాయ వర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. కార్పొరేట్ తరహాలో 2024–25 ఏడాదిలో ప్రవేశాలకు గాను జనవరి 25న నోటిఫికేషన్ జారీ అయింది. ఫిబ్రవరి 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కసారి సీటు సాధిస్తే వసతితోపాటు ఇంటర్మీడియట్ వరకూ ఉచితంగా చదువుకోవచ్చు. ఆంగ్ల మాధ్యమంలో బోధనతోపాటు నీట్/ఐఐటీలో ఉచితంగా శిక్షణ కూడా ఇస్తారు. విద్యార్థులకు మార్చి 10న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతిలో ప్రవేశాలకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రవేశానికి పరీక్ష ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో మంచి మార్కులు సాధించిన వారి జాబితాను ప్రకటించి, మెరిట్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 21 గురుకులాలు

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 21 గురుకులాలు ఉన్నాయి. వీటిలో ఐదో తరగతికి 80 సీట్లు చొప్పున 1,680, జూనియర్ ఇంటర్మీడియట్‌లో 80 సీట్లు చొప్పున 13 గురుకులాల్లో 1,040 సీట్లు ఉంటాయి. 13 గురుకులాల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసినప్పుడే నీట్, ఐఐటీ శిక్షణలో దేనిని తీసుకోనుంది ఆప్షన్ ఇవ్వాలి. వారిని ప్రభుత్వం నిర్వహించే కామన్ పరీక్షలకు పంపిస్తారు. ఉత్తమ ప్రతిభ చూపితే రాష్ట్రస్థాయిలో ప్రతిభా పరీక్షకు ఎంపిక చేస్తారు. ఇందులో రాణిస్తే కర్నూలు (చిన్నటేకూరు), గుంటూరు (గోరంట్ల), విజయవాడ (ఇడుగడ్లు) గురుకులాల్లో నీట్, ఐఐటీలకు శిక్షణ ఇస్తారు. ఇందులో రాష్ట్రవ్యాప్తంగా 700 వరకు సీట్లు కేటాయిస్తారు.

దరఖాస్తు చేయడం ఇలా...

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఐదో తరగతికి httpr://apfpcet.apcfrr.in, ఇంటర్మీడియట్‌కు httpr://apfpcet.apcfrr.ininter, ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి ఎంపిక చేసుకున్న పాఠశాల/కళాశాల వివరాలను తప్పనిసరిగా రాయాలి. వివరాలు సబ్‌మిట్ చేసిన తర్వాత మార్చుకోవడానికి అవకాశం లేదు.

అర్హతలు ఇవి...

- ఐదో తరగతిలో చేరాలనుకున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ ఒకటి నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.
- ఓసీ, బీసీ, ఎస్సీ (కన్వర్టెడ్ క్రిస్టియన్) (బీసీ-సీ) విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య పుట్టి ఉండాలి. 3, 4 తరగతులు గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉండాలి.
- జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు 2023-24 ఏడాదిలో పదో తరగతి పరీక్షకు హాజరవుతున్న వారు అర్హులు. వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 సంవత్సరాలు దాటకూడదు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, సాంఘిక సంక్షేమ వసతి కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు ఏడాదిపాటు సడలింపు ఉంటుంది.
- విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష దాటకూడదు.

ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు

ప్రతిభ ఆధారంగానే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తాం. విద్యార్థులు తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఎవరైనా సీట్లు ఇప్పిస్తామని చెబితే నమ్మవద్దు. సీట్ల కోసం ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే అలాంటి దళారుల సమాచారం తమకు ఇవ్వాలి. ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు అర్హులైన, ఆసక్తి ఉన్న విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

–పద్మజ, డీసీఓ, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ గుంటూరు,

ఎస్సీ, ఎస్టీలను అణదొక్కాలని చూస్తే ఊరుకోం



జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రవినాయక్, సభ్యులు

మాచర్ల రూరల్: ప్రశాంతంగా ఉన్న పల్నాడు ప్రాంతంలో రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు ఎస్సీ, ఎస్టీలపై కారుతో దాడులు చేస్తూ వారిని అడ్డం పెట్టుకొని పల్లెల్లో అశాంతిని రేకెత్తించాలని చూస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డికి ఎస్సీ, ఎస్టీలు తగిన బుద్ధి చెబుతారని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సభావత్ రవినాయక్ హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి కాన్వాయ్‌తో వెళ్తూ కంభంపాడు వద్ద ఎస్టీలు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టి వారిపై దౌర్జన్యానికి దిగటం, వెల్దుర్తి మండలంలో ఉప్పలపాడు వద్ద కారుతో ఢీకొట్టడమే కాకుండా, పచ్చని పల్లెల్లో వర్గాలు రేపుతూ ప్రశాంతంగా ఉన్న ప్రజల మధ్య చిచ్చులు పెట్టే రాజకీయాలు మానుకోవాలన్నారు. వారి ఎన్నికల ప్రయోజనం కోసం దళితులను అడ్డం పెట్టుకొని ఓటు రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. గత టీడీపీ పాలనలాగా దళిత, గిరిజనులను అణచివేసే ధోరణి ఇప్పుడు లేదని, జగనన్న ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనిస్తూ, రాజకీయంగా ప్రాధాన్యతనిస్తూ మమ్మల్ని ముందుకు నడిపిస్తుందని చెప్పారు. టీడీపీ ముఠా రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మరియదాసు, శ్రీనివాస్, దాసులున్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న సీఐ పీవీ ఆంజనేయులు

పిడుగురాళ్ల: మైనర్లు స్పోర్ట్స్ బైక్ నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరులతో సీఐ మాట్లాడుతూ పట్టణంలో బులెట్ ద్విచక్ర వాహనానికి ఎక్కువ సౌండ్ వచ్చే విధంగా ఏర్పాటు చేసుకొని వీధుల్లో తిరుగుతున్నారని, అటువంటివారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. అలాగే 18 సంవత్సరాలలోపు ఉన్న వారు స్పోర్ట్స్ బైక్ అతివేగంగా నడుపుతున్నారని, మైనర్ల తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. అతివేగంగా ద్విచక్ర వాహనాలను నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని, త్రిపల్ రైడ్ ప్రమాదమని అతివేగాన్ని నియంత్రిస్తే ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని, ప్రమాదాల నివారణకు ఇటువంటి చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ ఉన్నారు.

వైభవంగా భావనారుషి కలశ మహోత్సవం

నాదెండ్ల: భద్రావతీ సమేత భావనారుషి కలశ మహోత్సవం బుధవారంతో ముగిసింది. ఐదు రోజుల పాటూ నిర్వహించిన వేడుకల్లో భాగంగా తొలిరోజు కలశానికి శివాలయం వద్ద జలాభిషేకం నిర్వహించి అనంతరం సంప్రదాయబద్ధ మేళతాళాలతో పద్మశాలీయ వీధిలో వేసిన చలువ పందిరిలో ప్రతిష్టించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రి పద్మశాలీయ మహిళలు మూకుళ్లలో ఒత్తులు వేసుకుని దీపారాధన చేశారు. ప్రత్యేక వాహనంలో స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు అర్ధ రాత్రి వరకూ కొనసాగింది. మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. ఆకాశదీపాన్ని వదిలారు. సమారాధన నిర్వహించారు. భారీ అన్నదానం చేశారు. కార్యక్రమాలను పద్మశాలీయ బృహత్తర సేవా సంఘం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మద్యం కేసులో నిందితురాలి అరెస్ట్

నరసరావుపేట టౌన్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న కేసులో నిందితురాలిని అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార బుధవారం తెలిపారు. నకరికల్లు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ పది బాటిళ్ల అక్రమంగా మద్యం కలిగి ఉన్న వగ్గా జ్ఞానసుందరిని అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితురాలిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

ఉత్తమ సేవలు అందించిన వారిని ఎన్నటికీ మరచిపోరు



కిషోర్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న బెల్లంకొండ మీరయ్య, సిబ్బంది

పెదకూరపాడు: ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ప్రజలకు మంచి సేవలు అందిస్తే ఉద్యోగి ప్రజలకు చిరస్థాయిగా గుర్తుండిపోతారని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. పెదకూరపాడు మండల పరిషత్ పరిపాలన అధికారి కనుమూరి కిషోర్‌కుమార్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మీరయ్య మాట్లాడుతూ కిషోర్‌కుమార్ జూనియర్ అసిస్టెంట్‌గా గత 30 సంవత్సరాల క్రితం పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసి, ఇదే కార్యాలయంలో పరిపాలన అధికారిగా ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ వివిధ హోదాల్లో ప్రజలకు సేవలందించారన్నారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌షరీఫ్ మాట్లాడుతూ ప్రజల గుండెల్లో కిషోర్ కుమార్ నిలిచి ఉంటారన్నారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్, అరుణకుమారిలను సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, ఉపాధ్యాయనేత రావిపూడి సాంబశివరావు, ఎంపీడీవో నరసింహారావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దేవరంపాడు చేపల చెరువు రూ.33.52 లక్షలు



పంచాయతీ కార్యాయలంలో చేపల చెరువుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

రాజుపాలెం: మండలంలోని దేవరంపాడు పంచాయతీలో గల చేపల చెరువుకు పంచాయతీ కార్యాలయంలో పల్నాడు డీఎల్‌పీవో రామణయ్య ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట బుధవారం నిర్వహించారు. 80 ఎకరాల చేపల చెరువుకు రెండేళ్లపాటు చేపలు పెంచుకునేందుకు 9 మంది పాటదారులు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనగా రాము రంగారావు రూ.33.52 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పత్తిపాటి దీనమ్మకోటేశ్వరరావు, ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటి, దేవరంపాడు దేవస్థానం చైర్మన్ శ్యామకూరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం



వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదకూరపాడు: మండల పరిధిలోని పాటిబండ్ల గ్రామంలో కారుణ్య వృద్ధాశ్రమంలో గుంటూరు కందన్ నేత్రాలయం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆశ్రమంలో వంద మంది వృద్ధులకు డాక్టర్ ఫణీంద్ర నేపథ్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు ఫాదర్ అల్లం చిన్నశౌరిరెడ్డి, ఫాదర్ అల్లం చిన్నారెడ్డిలు మాట్లాడుతూ అనాథలకు కారుణ్య ఆశ్రమం అండగా నిలుస్తుందన్నారు. భోజనం, వసతి, ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమం మేనేజర్ రాము, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్రీడాభివృద్ధికి ఆర్థిక సాయం



నార్నెపాడు జెడ్పీ పాఠశాల హెచ్ఎం రమేష్‌కు సాయం అందిస్తున్న జగదీష్‌కుమార్

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల క్రీడాభివృద్ధికి గాను గుంటూరుకు చెందిన కనుమూరి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు రూ.40వేలు ఆర్థిక సాయం బుధవారం అందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించి గ్రామానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అందుకు గాను అవసరమైన క్రీడా వస్తువులు, దుస్తులను కొనుగోలు చేయాలని సూచించారు. ఆ మేర సాయాన్ని తన ప్రతినిధి జెట్టి జగదీష్ ద్వారా ప్రధానోపాధ్యాయుడు రమేష్‌కు అందించారు. కార్యక్రమంలో పీడీ నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ కేవైసీతో అన్నదాతలకు బహుళ ప్రయోజనాలు



చేజర్ల గ్రామంలో ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి దేవదాసు

నకరికల్లు: సాగుచేస్తున్న పంటలకు ఈ క్రాప్ నమోదు చేసుకోవడం ద్వారా సాగుదారులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు అన్నారు. మండలంలోని కుంకలగుంట, చేజర్ల, నకరికల్లు గ్రామాలలో ఈ పంట నమోదు ప్రక్రియను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో వరి, కంది, మినుము, జొన్న, శనగ, మొక్కజొన్న, కూరగాయలు తదితర పంటలు 5,809 ఎకరాలలో సాగుచేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రాప్ నమోదు ఫిబ్రవరి 15వ తేదీ వరకు చేసుకోవచ్చన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు కె.సాయివెంకట్, వి.వంశీ, రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీవో మహేష్‌కు సన్మానం



క్రోసూరు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ అధికారి బి.మహేష్ ఎన్నికల విధుల్లో భాగంగా ప్రకాశం జిల్లా, పెదచర్లపల్లి మండలానికి బదిలీ అయ్యారు. ఇక్కడకు ఎవరు వచ్చేది ఇంకా ఖరారు కాలేదు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, ఎంపీపీ పి.కోటయ్య, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీడీవో గత ఏడాది జూన్ నెలలో ఇక్కడకు వచ్చారని వచ్చిన ఆరు మాసాల్లోనే అందరికి తలలో నాలుకలా పనిచేసి మంచి పేరు సంపాదించారని అన్నారు. ఇటువంటి అధికారి బదిలీ కావటం బాధగా ఉన్నా ప్రభుత్వ ఆదేశాలు తప్పనిసరిగా అనుసరించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.